అంతిమ మజిలీకి అవస్థలే

- యానాం తీర గ్రామాల్లో దయనీయ స్థితిలో శ్మశానవాటికలు
- కనీస సదుపాయాలు కరవు.. వర్షమొచ్చినా మునకే
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు

యానాం: మనిషి ఆఖరి మజిలీలో భాగంగా అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వినియోగించే శ్మశాన వాటికలు దయనీయ స్థితిలో ఉన్నాయి. యానాం నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాలు, గోదావరి తీరంలో ఉన్న శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేకపోవడంతో ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షమొచ్చినా మునిగిపోయే, ముళ్లపొదలతో రోడ్డు మార్గమైనా కనిపించని శ్మశానవాటికలెన్నో.. అయినా అధికారులు మాత్రం అదేమీ పట్టించుకోకుండా చోద్యం చూస్తుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

- తీరప్రాంత గ్రామమైన నియోజకవర్గ శివారున ఉన్న సావిత్రినగర్ శ్మశాన వాటికకు వెళ్లడానికి రహదారి కూడా లేదు. పైగా గోదావరికి వరదలు వచ్చినా, భారీ వర్షాలు వచ్చినా ముంపునకు గురవుతుంది. అలాంటి సమయాల్లో తమ ఆత్మీయులకు అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో నిండి ఉంటుండటంతో స్థానిక యువకులే ఎప్పటికప్పుడు శ్రమదానం చేస్తూ శుభ్రం చేసుకుంటున్నారు. రాత్రివేళల్లో విద్యుత్‌దీపాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ముళ్లపొదల్లో దొమ్మేటిపేట శ్మశానవాటిక

- నియోజకవర్గానికి శివారున ఉండే దొమ్మేటిపేట గ్రామానికి గోదావరి ఒడ్డున ఉన్న ఒక సెంటు భూమిలో శ్మశానవాటిక ఉంది. అక్కడకు వెళ్లేందుకు కనీస దారిలేదు. గోదావరికి వరదలొస్తే మునిగిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు చుట్టుపక్కన ఉన్న ఫ్యాక్టరీల నుంచి వ్యర్థాలను అక్కడే పడేస్తుండటంతో ఆక్రమణలకు గురవుతుంది. శ్మశానవాటికను మట్టితో చదునుచేసి ఎర్త్‌ఫిల్లింగ్ చేసి రహదారి వేయాలని స్థానికులు కోరుతున్నారు.
- భీమ్‌నగర్ శ్మశానవాటికను భీమ్‌నగర్, వికాస్‌కాలనీ, సిద్ధార్థనగర్, యూకేవీనగర్ తదితర గ్రామాలకు చెందినవారు ఉపయోగించుకుంటారు. గోదావరికి పక్కన ఉన్న ఈ రుద్రభూమిలో వరదలు, వర్షం వస్తే ముంపునకు గురవుతుంది. శ్మశానవాటిక ముందు భాగం గట్టుపై కొంతమంది బిర్యానీ దుకాణాలు పెట్టి ఆక్రమణలు చేశారు. అయినా పిడబ్ల్యుడి అధికారులు పట్టించుకోవడం లేదు.
- యానాం పట్టణంలో దాదాపు సగానికి పైగా జనాభా తమ ఆత్మీయుల అంత్యక్రియలను మెట్టకూరు గ్రామంలో ఉన్న రుద్రభూమిలోనే నిర్వహించుకుంటారు. ఈ శ్మశానవాటిక ముళ్లపొదలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తుంది. శ్మశానవాటికను పూర్తి స్థాయిలో శుభ్రపరచాలని కోరుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టైడల్ లాకు వద్ద ఉన్న హిందూ శ్మశానవాటికలో సైతం కనీస సౌకర్యాలు కరవయ్యాయని గ్రామస్తులు చెబుతున్నారు.


సావిత్రినగర్‌లో శ్మశానవాటిక దుస్థితి

కనీస సదుపాయాలు లేవు



గోదావరికి వరదలు లేదా భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారి సావిత్రినగర్ శ్మశానవాటిక మునిగిపోతుంది. రహదారి, విద్యుత్, తాగునీరు లేవు. అంత్యక్రియలుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తీర గ్రామాల్లో శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలి.

– మల్లాడి రాజు, సావిత్రినగర్, యువత అధ్యక్షుడు

క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పెన్మత్స జగ్గప్పరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేడంగి పవన్ శర్మ మంత్రోచ్చరణల మధ్య పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సరిపెల్ల రామకృష్ణంరాజు, గంజి జాజి, కాజులూరి రామలింగేశ్వరరావు, మంత్రి ప్రగడ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

వెంకన్నకు తులాభారం కాటా సమర్పణ


తులాభారం కాటాను అందిస్తున్న దాత శివయ్య కుటుంబీకులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తులాభారం మొక్కులు తీర్చుకునే కాటాను పట్టణానికి చెందిన అడపా శివయ్య సమకూర్చారు. కాటాను ఆయన ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి ఆలయంలో ఆదివారం అందజేశారు. తన మనమడు శ్రీహర్ష పుట్టిన రోజు సందర్భంగా శివయ్య ఈ కాటాను ఆలయానికి సమర్పించారు. అనంతరం శివయ్య కుటుంబీకులు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో పాటు మంత్రాక్షితలను అందించి ఆశీర్వదించారు.

నరసింహ చంద్రకుమార్‌కు అవార్డు


చంద్రకుమార్‌ను అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

అమలాపురం రూరల్: క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చిత్రకళా సంస్థ ఇటీవల నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చిత్రకళా పోటీల్లో అమలాపురానికి చెందిన చిత్రకారుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ విజేతగా నిలిచి అవార్డు అందుకున్నారు. ఆదివారం రాజమహేంద్రవరం అనుపమ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రాజమండ్రి ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ టీకే విశ్వేశ్వర రెడ్డి, వై.త్రినాథమూర్తి, డాక్టర్ రవి, వై.కళాసాగర్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఘనంగా గ్రామ దేవత జాతర


ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని కూనవరం గ్రామంలో వేంచేసి ఉన్న మరిడమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి నైవేద్యాలు చెల్లించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేబీఆర్ నాయుడు కుటుంబానికి పరామర్శ

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న కేంద్ర టొబాకో డెవలప్‌మెంట్ బోర్డు మాజీ చైర్మన్ కేబీఆర్ నాయుడు కుటుంబాన్ని ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు ఆదివారం పరామర్శించారు. అమలాపురంలోని నాయుడి ఇంటికి రుద్రరాజు వెళ్లి ఆయన మాతృమూర్తి సావిత్రమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కొత్తూరి శ్రీను, వంటెద్దు బాబి, అయితాబత్తుల సుభాషిణి, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాస్ తదితరులున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


అమలాపురంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ వీరబాబు

అమలాపురం రూరల్: ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం రూరల్ సీఐ వీరబాబు హెచ్చరించారు. అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం తాలూకా పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు అమలాపురంలో రూరల్ సీఐ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెచ్చగొట్టే ప్రకటనలు, కార్యకలాపాలు చేయొద్దని సూచించారు. ఎవరైనా ఎలక్షన్ కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో షేర్ చేసినా చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామన్నారు. పీడీ యాక్ట్ కేసులు పెట్టి, గ్రామ బహిష్కరణ సైతం చేస్తామన్నారు. తాలూకా, అల్లవరం, ఉప్పలగుప్తం ఎస్ఐలు శేఖర్‌బాబు, హరీష్‌కుమార్, ఎం.జోషి తదితరులు పాల్గొన్నారు.

శివలింగాల తయారీ


కోటి శివలింగాల తయారీలో మహిళలు

యానాం: పవిత్ర పుణ్యక్షేత్రం కాశీ(వారణాసి)లో జరిగే లింగాభిషేకానికి పంపేందుకు స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో శివలింగాలను తయారుచేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక గౌతమీ నదీ తీరంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు తాము గత నాలుగురోజులుగా 40 వేల శివలింగాలను తయారుచేసినట్లు మహిళలు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళలు తరలి వచ్చి పాల్గొనాలన్నారు. రాజీవ్ రివర్ బీచ్‌లో కొలువైన కాశీకృష్ణభగవాన్ ఆశ్రమంలో ఆదివారం భక్తుల సహకారంతో ఏకాహం నిర్వహించారు.

కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలు పాటించాలి

యానాం: ఈ నెల 4న స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న కౌంటింగ్ ప్రక్రియలో అధికారులంతా నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలుత స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను, పోలైన ఈవీఎంలను పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ రోజు ఉదయం 7 గంటలకు తెరుస్తామన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ ఓట్ల లెక్కింపు, 8.30 గంటలకు ఈవీఎంల్లో పోలైన ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. కౌంటింగ్ హాలులో 10 టేబుల్స్ ఏర్పాటుచేశామని, మొత్తం 4 రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చేవారు గుర్తింపు కార్డు ధరించాలని, ఏజెంట్లను కౌంటింగ్ హాలు వెనుక వైపు గేటు నుంచి మాత్రమే అనుమతిస్తామన్నారు.

కౌంటింగ్ పరిశీలకుడి రాక

యానాం కౌంటింగ్ పరిశీలకుడిగా నియమించిన రాకేష్ కుష్రే ఆదివారం యానాంకు చేరుకున్నారు. ఆర్‌ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ ఆయనకు స్వాగతం పలికి దుశ్శాలువాతో సత్కరించారు.

పంట కాలువల్లో పూడికలు తొలగించాలి

తాళ్లరేవు: పంట కాలువల్లో పూడికలు తొలగించి సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలోని కాటన్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ మండలంలో ఇంజరం వంతెన వద్ద వేసిన తూముల కారణంగా సాగునీరు సరఫరా కావడం లేదని, వాటిని తొలగించి ఇంజరం వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పేరాబత్తుల సాయి, నరేంద్ర, భైరవమూర్తి, అనుసూరి చిన్న సత్యనారాయణ, దున్నా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దరియాలతిప్ప సొసైటీ భూముల పరిశీలన


దరియాలతిప్ప భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ శివారు దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములను ఆదివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పరిశీలించారు. పుదుచ్చేరి ప్రభుత్వం గతంలో ఈ భూములను సాగు చేసుకోవడానికి రైతులకు ఇచ్చింది. అయితే గౌతమీ గోదావరిని చేర్చి ఉన్న ఈ భూములు వరదలకు తరచూ మునిగిపోతున్నాయి. ఏటిగట్టు సైతం గండి పడడంతో బలహీనంగా మారిందని రైతులంతా ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన క్షేత్రస్థాయిలో ఆ భూములను పరిశీలించారు. తమ పంట పొలాలను వరద ఉధృతి నుంచి కాపాడటానికి శాశ్వత ప్రాతిపదికన రివిట్‌మెంట్ నిర్మాణం చేయాలని రైతులు కోరారు. దీనికి స్పందించిన ఆయన రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి గట్టు రక్షణకు శాశ్వతంగా రివిట్‌మెంట్ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు కోరుకొండ ఆనందరావు, కార్యదర్శి కొల్లు మాధవస్వామి, గ్రామపెద్దలు సబ్బతి శ్రీనివాసరావు, కమిడి బాలయోగి, గిడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు సారె

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి 37వ వార్షిక మహోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం గ్రామంలో ముత్తయిదువలు అందరూ కలిసి స్వామి, అమ్మవార్లకు సారె సమర్పించారు. తొలుత మహిళలంతా కలిసి మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య పసుపు కుంకుమలు, చీర, జాకెట్లు, గాజులు, చలివిడి, అరటిపళ్లు, మిఠాయిలను ఊరేగింపుగా స్వామి వారి సన్నిధికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు బీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో సారెను స్వామి, అమ్మ వార్లకు నివేదించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గడప గడపకూ వెళ్లి సారెను పంచి పెట్టారు. కార్యక్రమంలో బిళ్ల లక్ష్మీకుమారి, అంకం సత్యలక్ష్మి, నల్లా జయ, బిళ్ల భద్రకాళి, పిచ్చిక జ్యోతి, నల్లా వెంకట సత్యనారాయణమ్మ, దొమ్మేటి దుర్గ, బాసిన భారతి తదితరులు పాల్గొన్నారు.


బండారులంకలో సారె సమర్పించిన ముత్తయిదువలు

వేసవి శిబిరాలతో చిన్నారుల్లో సృజనాత్మకత వెలికితీత


సమ్మర్ క్యాంప్‌లో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివన్నారాయణ తదితరులు

తాళ్లరేవు: వేసవిలో నిర్వహించే శిబిరాల ద్వారా చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయొచ్చని సమ్మర్ క్యాంప్ ముగింపు సభలో పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కుడుపూడి శివన్నారాయణ, టిల్లపూడి నాగేశ్వరరావు తదితరులు బహుమతి ప్రదానం చేశారు. చిన్నారులు పేపర్ క్రాఫ్ట్‌తో తయారు చేసిన వస్తువులను అతిథులకు బహుమతులుగా అందజేశారు. సమ్మర్ క్యాంపును విజయవంతంగా నిర్వహించిన కన్వీనర్ గుత్తుల మల్లేశ్వరరావును పలువురు అభినందించారు. కార్యక్రమంలో వడ్డి ఏడుకొండలు, ఉంగరాల వెంకటేశ్వరరావు, రెడ్డి రెడ్డిబాబు, పట్టా ఆదినారాయణ వర్మ, పబ్బినీడి మణి, అత్తిలి బాబూరావు, టి.ఈశ్వరరావు, వల్లు రాజబాబు, అబ్రహం, రవీంద్రరెడ్డి, పొన్నాడ పేరయ్యరాజు, తాతారావు, వీరేంద్ర, నాని, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు భారీ విరాళం


దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన గల్లా పవన్‌కుమార్, హనీషా దంపతులు, గల్లా నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. భారీ విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు దాత కుటుంబాలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

కొబ్బరి రైతులతో ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు

మామిడికుదురు: కొబ్బరికి జాతీయ స్థాయిలో వాణిజ్య పంటగా గుర్తింపు తీసుకురావడంతో పాటు కొబ్బరి ఉప ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ వ్యాపారాలతో అనుసంధానం చేసే విధంగా పది రాష్ట్రాల ప్రతినిధులతో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. బెంగళూరులో జాతీయ కన్సార్టియం ఫర్ కోకోనట్ స్టేక్ హోల్డర్స్ అనే సంస్థలో ఎగ్జిక్యూటివ్ కమిటీని రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కమిటీలో బెంగళూరుకు చెందిన మాజీ ఎమ్మెల్సీ మనోహర్ వస్కీ గౌరవాధ్యక్షుడిగా, తమిళనాడుకు చెందిన చెల్లాదురై కో–ఆర్డినేటర్‌గా, కేరళకు చెందినన రే మణి గోపాలకృష్ణన్ ట్రెజరర్‌గా, ఆంధ్రప్రదేశ్ నుంచి మామిడికుదురుకు చెందిన నయనాల వేణుగోపాల్ కన్వీనర్‌గా, మామిడికుదురు మండలం పెదపట్నంలంకకు చెందిన వేగి వెంకటేశ్వరరావు కో–కన్వీనర్‌గా నియమితులయ్యారు. కన్వీనర్ వేణుగోపాల్, కో–కన్వీనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని కొబ్బరి సాగు చేసే 12 రాష్ట్రాల్లో కొబ్బరి పంట సాగు, దిగుబడులు, కొబ్బరిని ఆశించే తెగుళ్లు, విలువ హెచ్చింపు, రైతుల ముఖ్యమైన సమస్యలపై జాతీయ స్థాయిలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, ప్రభుత్వ మరియు పరిశోధక సంబంధిత వ్యవస్థలతో అనుసంధాన ప్రాత పోషించేందుకు ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు.


నూతనంగా ఏర్పడిన ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధులు

అనారోగ్య బాధితుడికి రూ.50 వేల సాయం

మలికిపురం: గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ అయినవిల్లి మండలం తొత్తరమూడి గ్రామానికి చెందిన బొక్కా సాయిబాబుకి సంస్థ ప్రతినిధులు కడలి ఈశ్వరి, గుబ్బల శ్రీనివాస్ చేతుల మీదుగా ఆదివారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన సాయిబాబుకు అత్యవసర ఆపరేషన్ చేయించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబ దాతల సాయం కోరడంతో ఈ మేరకు అందించినట్టు సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్ తెలియజేశారు. కార్యక్రమంలో కడలి ఈశ్వరి, తొత్తరమూడి గ్రామ పెద్ద మట్టపర్తి రామారావు, సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్ , చెల్లుబోయిన సుబ్రహ్మణ్యం, బైరిశెట్టి వెంకటరమణ, కట్టా శ్రీను, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ

మలికిపురం: కేశనపల్లి హైస్కూల్ నుంచి కరవాక వరకూ సోమవారం ఉదయం 6 గంటలకు ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా భారీ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజిక వేత్త బోనం రాజు ఆదివారం తెలిపారు. సైక్లిస్ట్ డాక్టర్ జాన వీరభద్రప్రసాద్, సైక్లిస్ట్ డాక్టర్ కుందెం మహాలక్ష్మి శ్రీనివాస్, సైక్లిస్ట్ డాక్టర్ కేఎస్‌వీ శ్రీనివాసరావు, సైక్లిస్ట్ దెందుకూరి రాంబాబురాజు ఉచిత అంబులెన్స్ నిర్వాహకులు తదితర ప్రముఖులు ర్యాలీలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పి.గన్నవరం: మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2000 సంవత్సరానికి ముందు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులతో అమ్మ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు యర్రా శేష కుమారి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు విచ్చేసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం..

పోతవరం ప్రాథమిక పాఠశాలలో చదువుకుని మెట్రో కెమ్ ఏపీఐ సంస్థను స్థాపించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన పాఠశాల పూర్వ విద్యార్థి, గ్రామానికి చెందిన డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ)ని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అభినందించారు. వెంకటేశ్వర రావు, విజయలక్ష్మి దంపతులను అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కోనసీమలోని ఎన్నో దేవాలయాలకు, క్రీడాకారులకు, విద్యాలయాల అభివృద్ధికి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారం అందిస్తున్నారని వారు ప్రశంసించారు. తాను చదువుకున్న పాఠశాలకు ఆయన అందించిన రూ.3.5 లక్షల విరాళంతో షెడ్డు నిర్మాణం, ఫర్నిచర్, కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్టు ఫౌండేషన్ అధ్యక్షురాలు శేషకుమారి తెలిపారు. అలాగే పోతవరం గ్రామ సచివాలయానికి వెంకటేశ్వరరావు అందించిన విరాళం రూ.5 లక్షలతో ఫర్నిచర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వీటిని ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు, కొండ్రెడ్డి బాలాజీ, తెలగారెడ్డి విజయకృష్ణ, నందెపు శ్రీనివాస్, బొడ్డు వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.


పోతవరంలో మెట్రో కెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

భారీ వర్షంతో రహదారులు ఛిద్రం

మామిడికుదురు: రెండు రోజుల నుంచి మామిడికుదురు మండల వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. ఈ భారీ వర్షంతో రహదారులు అధ్వానంగా మారాయి. పాశర్లపూడిలోని 216వ నంబర్ జాతీయ రహదారి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌కు కూత వేటు దూరంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో జాతీయ రహదారిపై భారీగా గోతులు ఏర్పడ్డాయి. అక్కడ రోడ్డు అగాధంలా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 200 మీటర్ల మేర జాతీయ రహదారి దారుణంగా పాడైపోవడంతో వాహనాలు ఉయ్యాలా, జంపాల అన్న తరహాలో తీవ్ర భయం, భయంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలు ఖరీఫ్ పంట సాగుకు ఎంతో ఉపయోగపడతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి తోటలకు భారీ వర్షం వల్ల కొబ్బరి తోటలకు సైతం మేలు జరుగుతుందని రైతులు పేర్కొన్నారు.

దోబూచులాడుతున్న వరుణుడు

అంబాజీపేట: గత కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపం చూపడంతో అల్లాడిన ప్రజలు శని, ఆదివారాల్లో వేకువజాము నుంచి ఉదయం 8 గంటల వరకు ఆకాశంలో కారు మబ్బులు కమ్మేయడం, కొద్దిపాటి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఊపిరి పీల్చుకున్నారు. ఇంత వరకు బాగానే ఉన్న మధ్యాహ్న సమయానికి భానుడు తన ప్రతాపాన్ని చూపడం, వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో తీవ్ర ఉక్కపోతకు గురై వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి సమయంలోను అధిక ఉష్ణోగ్రతలకు తోడు, ఉక్కపోత అధికంగా ఉంటుంది. అప్పటికప్పుడే వాతావరణంలో మార్పులు సంభవించి చినుకులు పడటం, అనంతరం ఒక్కసారిగా వాతావరణం వేడెక్కడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రెండు రోజులు పాటు అక్కడక్కడ తేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేయడంతో వర్షాలు పడితే వాతావరణం చల్లబడుతుందని ప్రజలు భావిస్తున్నారు.


పాశర్లపూడిలో భారీ వర్షానికి అధ్వానంగా మారిన జాతీయ రహదారి


అంబాజీపేటలో ఉదయం 6 గంటలకు మబ్బులు కమ్ముకున్న ఆకాశం